# మంచుదెబ్బ

--నిడదవోలు మాలతి.

పశ్చిమ దిక్కున విచ్చలవిడిగా చెలరేగుతున్న శారదనీరద పంక్తుల్ని చూస్తూ డాబామీద నించున్నాను. ఇవేనేమో వప్రక్రీడా గజప్రేక్షణీయంగా కనిపెంచినవి. నల్లగా బండరాళ్లలా, కారుఎనుముల్లా ఉన్న ఆ మేఘాలు అస్తమిస్తున్న సూర్యుడిని దాచ ప్రయత్నిస్తున్నాయి. సూర్యనారాయణుడు అల్లరిపిల్లవాడిలా అడుగునుంచే చేతులు చాపుతున్నాడు. దివ్యకాంతులు విరజిమ్మే ఘనశ్యామసుందరుడు ఇలాగే ప్రకాశించేవాడు కాబోలు. అంత ఎత్తుకు ఎగరలేని రాధ క్రిందనుంచి దిగులుగా-- ''నీలీలలకి అమాయకనైన నేనే దొరికానా?'' అన్నట్లు చూస్తుంది కాబోలు. ..

.. నాకూ మేఘమాలికలకీ మధ్య వచ్చి నిలచిన రాధ- ఎదురుగా డాబామీద - మెల్లిగా కదిలి నేపథ్యంలోకి మాయమైంది. ఆ నడక తీరు జంకొదవెడి కాళ్లతోడ మెల్లిగా మెట్లు దిగుతున్న రాచపిల్ల పోలికనుంది.

నాకు తెలిసినంతమటుకు ఆ యింట్లో ఒకే వృద్ధవనితుంది. ఆ యింటికి ఆమే యజమానురాలు. ఆ యిల్లు మా యిల్లు నానుకుని వెనకవేపుంది. మూడు తరాలకి ముందు ఆయింటికీ ఈ యింటికీ ఒక్కడే యజమాని అనడానికి సాక్ష్యం రెండు డాబాల్ని వేరు

చేస్తూ నిలచిన మూడడుగుల పిట్టగోడ. రాజమార్గాన సింహద్వారం చేరాలంటే ఓ వందగజాలు నడిచి, రెండు మలుపులు తిరిగి కాని చేరలేం.

రాత్రి భోజనాలదగ్గర అమ్మతో అన్నాను, ఆ వెనకయింట్లోకి ఎవరో వచ్చినట్టున్నారే అని.

''ఆ ముసలావిడకి మనవడో ఏదో అవుతాట్ట. మొన్న పదో తారీకున పెళ్లయిందిట. పిల్ల కుందనపు బొమ్మలా వుంది. ఆ కళ్లు అలా తిప్పిందంటే ఈచివరకొస్తూ. ఏంలాభం. ఏదో జబ్బుట. మాటాడదు. అన్నం తినదు. గజ్జలగుర్రంలా దాట్లేసే పిల్ల జీవచ్ఛవంలా తయారయిందని ఆవిడ గోలెత్తుతోంది.'' ఔచితికి తగిన అంగన్యాస కరన్యాసాలతో అమ్మ వివరిస్తూంటే ఇంత భోగట్టా ఎలా సేకరించిందన్న ఆశ్చర్యం కన్నా, పెళ్లయి వారం రోజులయినా పెదిమ కదపని ఆ ముద్దరాలి ప్రవర్తన ఆశ్చర్య పరచింది నన్ను.

''మూగపిల్లేమో'' అన్నాను.

''సరేలే''

తలెత్తి అమ్మ వేపు చేశాను, ఎందుకు కాకూడదూ అన్నట్టు.

''పెళ్లి చూపుల్నాడు అష్టపది పాడిందిట. ఆపాటకే మురిసిపోయి చేసుకున్నారుట.''

''ఏం పాట బాబూ అదీ?'' అన్నాను నవ్వుతూ.

''ధీర సమీరే.''

తృళ్లిపడ్డాను. ఆ పాట అంత మనోరంజకంగా పాడగల మనిషిని నాకు తెలుసు. నేను గుంటూరులో చదువుకుంటున్న రోజుల్లో నాతోపాటు స్కూలికి వస్తూ థర్డుఫారం చదివిన వకుళది. తన పాట విని పెళ్లి చేసుకోడం ఓ ఉద్ధరింపు కాదు. తనపాటకి పాటలే ఆడతాయి. స్కూల్లో ఖడ్గతిక్కన నాటకం వేస్తే, వకుళ వార్తాహరుడుగా ఒకనిముషంపాటు స్టేజిమీద కనిపించి తన కంఠమాధురితో ప్రేక్షకుల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయిన వకుళ, తిక్కన మరణించాడని చెప్పడానికి వచ్చి, చానమ్మ వీరపత్నిగా ఆచంద్రతారార్కం కీర్తింపబడుతుందని చెప్పేఘట్టం. వకుళ పద్యం చదువుతుంటే స్థాణువులైపోయిన ప్రేక్షకులు

వన్స్‌మోర్ అంటూ కేకలేస్తే, చానమ్మకి అయ్యో అని వాపోడానికి అవకాశమే దొరకలేదు. నేను సాయంత్రం డాబామీద చూసింది ఆ వకుళనన్నమాట.

మావూళ్లో శలవుల్లో తోచదని ఇక్కడికొచ్చి, ఇక్కడ కాలక్షేపంకోసం కొట్టుకుపోతున్న నాకు నచ్చిన స్నేహితురాలు దొరికిందని సంతోషించాను. కానీ అంతలోనే జ్ఞాపకం వచ్చింది-- మతే పోయిందో, మనసే పోయిందో, రోగమో, నొప్పో ఏదీ తెలీదు. కన్న తల్లితండ్రులతోనూ, కట్టుకున్న భర్తతోనూ మాటాడని వకుళ నాతో మటుకు మాటాడుతుందా? వాళ్లకంటె నేను ఎక్కువా? అందులోనూ మా చుట్టరికం ఏనాటి మాట!!

ఆఖరికి అమ్మమీద విసుక్కున్నాను, ''మాటాడ్డానికి కాదు సరికదా దెబ్బలాడ్డానికేనా ఎవరూ లేని అడవి. నేను రానంటుంటే తీసుకువచ్చావిక్కడికి'' అని.

వకుళ పగలంతా ఎక్కడా కనిపించలేదు. కాని సాయంత్రం సరిగ్గా నిన్నటివేళకి డాబామీదకి వచ్చింది. ఆకాశం ముసురేసి ఉంది.

చినుకు పడితే తగలబడిపోతుందని డాబామీద ఎండబెట్టిన ఆవకాయ ఎత్తిపెట్టడానికి వచ్చింది అమ్మ. నేనూ సాయం చెయ్యడానికి అటు వెళ్లాను.

వకుళని పిలుద్దాం అనుకుంటుంటే, ఒకతను వచ్చాడు డాబామీదకి. పొట్టిగా, నల్లగా ఉన్నాడు. ''అమ్మా, వాళ్లూ ఎవరూ లేరు. నేనలా బయటికెళ్తున్నాను.'' వకుళ అలవోకగా అతనివేపు చూసి మొహం తిప్పుకుంది.

''ఏం?'' అన్నాడతను మళ్లీ. వకుళ ఈమారు ఆమాత్రం చూడను కూడా లేదు.

''ఛీ. ఏం మనిషి. అత్తకి చూపుచేటూ, కోడలికి మోపు చేటూను,'' అతను గొణుక్కుంటూ వెళ్లిపోయాడు.

సరసుడే అనుకున్నాను.

వకుళకీ నాకూ చిత్రమైన స్నేహం వుండేది. మేమిద్దరం కలిసి ఆడుకున్నవాళ్లంకాదు. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్నవాళ్లమూ కాదు. కాని వకుళ దేనికైనా బాధ పడితే నాదగ్గరకొచ్చి కూచునేది. మాయిద్దరిమధ్య మాటలూ, సమస్యలూ, సమాధానాలూ లేకపోయినా మాకేమీ వెలితి వుండేది కాదు. ఎదటి మనిషి కాల్లో ముల్లు విరిగితే తన గుండెల్లో గునపాలు గుచ్చుకున్నట్టు విలవిల్లాడే వకుళ ''ఛీ'' అనిపించుకుంటూ బతుకు సాగించుకుంటోందంటే ఏదో జరిగి ఉండాలి. కాని అది ఏమిటి? కడుపులో బాధ కన్న తల్లికే చెప్పుకోని వకుళ నాకు చెప్తుతుందన్న భ్రమ నాకు లేదు. కాని ఒకటో రెండో కథలు కల్పించి రాసిన నాకు వకుళ వ నకారణం మాత్రం క్లూ దొరకని పజిల్లా ఉండిపోయింది. ఆ రాత్రంతా ఆలోచించినా తెగలేదు.

మర్నాడు పొద్దున్న అమ్మ మళ్లీ డాబా మీదికి రావడంతో, నేనూ స్నానం చేసి వచ్చాను. వకుళ బట్టలారేస్తోంది వాళ్ల డాబామీద. తెగించి పిలిచాను. వకుళ వులిక్కిపడి నావేపు చూసి, వెళ్లిపోయింది.

''ఏం, నువ్వు దిగి వచ్చాననుకుంటున్నావేమిటి?'' అంది అమ్మ, వకుళ నాకు సమాధానం చెప్పలేదని.

''ఏం జబ్బో!'' అన్నాను సాలోచనగా.

''జబ్బేమిటి, తెగులు,'' అంది అమ్మ. నేను తెల్లబోయాను.

నిన్న గాక మొన్న తన స్థితికి జాలి పడిన అమ్మ ఇవాళ ఇంత కఠినంగా మాటాడ్డానికి వకుళ చేసిన నేరం ఏమిటో?

అమ్మదగ్గిరినించి రాబట్టగలిగిన కథ యిదీ-- ముందు రోజు సాయంత్రం వకుళ అత్తగారు ఓ పొరుగువెలుగుతో పచ్చీసు ఆడుతుండగా, ఆమెభర్త నరహరి వీధిలోకి వెళ్లిపోయాడు, వకుళతో చెప్పి. అది నిజం అనడానికి నేనే సాక్ష్యం. అలా అతను ఆ చల్లని సాయంవేళ షికారు వెళ్లిన సందర్భం ఆసరా చూసుకుని దారిన పోతున్న ఒక సీజరు సావిట్లో ఉన్న రేడియో, ఆ పక్కనే

కుర్చీ మీద నీటుగా ఇస్త్రీ చేసి పెట్టిన పట్టుచీరా పట్టుకు పోయాడు. మండువాలో మంచంమీద కూర్చుని వున్న వకుళ అతను ఇంటిలో ప్రవేశించిన క్షణం నుంచీ చూస్తూనే ఉందిట, పరమానందయ్య శిష్యుడికైనా సిగ్గు తెప్పించగల నిశ్చలతతో.

''చిత్రంగానే ఉంది,'' అన్నాను నవ్వుతూ.

''నీకు నవ్వుగా ఉందేం? నూటయాభై రూపాయల ఆరణి చీర,'' అంది అమ్మ ఆ చీర తనదే అయినట్టు.

చీరస్వంతదారే చీర పోతున్న దారి చూస్తూ ఊరుకుంటే నాకెందుకు నొప్పి? పడేవాళ్లు పడితే నవ్వకలిగిన వాళ్లు నవ్వరాదంటుంది అమ్మ. ఆ పరిస్థితుల్లో ఆ చీరె నాదే అయినా నవ్వి వుండేదాన్ని.

''కాఫీ కలరు, ఆరెంజి బోర్డరు.. ఎలా అంటే అలా ఉండేదిట,'' అంది అమ్మే మళ్లీ.

గతుక్కుమన్నాను.

''పెళ్లి చీరెలన్నీ కొనడం అయిపోయిన తరవాత, వకుళ ఆచీరె చూసి పట్టు పట్టి కొనిపించిందిట.''

ఆడవాళ్లకి చీరలమీద మోజు కట్టుకున్న మొగవాడిమీద ఉండకపోవడంవల్లే సంసారాల్లో కలతలు వస్తున్నాయని ఒక ప్రాజ్ఞుడి అభిప్రాయం. వకుళ కోరి కొనిపించుకున్న పట్టుచీర చేజేతులా పారేసుకుందంటే ఈమారు నాకు నవ్వు రాలేదు. తనకి ఆరెంజి బోర్డరు మీదున్న ప్రేమ నాకు తెలియనిది కాదు.

రోజూ సాయంత్రం అదేవేళకి వాళ్ల డాబామీద తనూ, మాడాబామీద నేనూ చేరేవాళ్లం. మూడు రోజులు పోయేక కాబోలు నావేపు చూసింది. ఆచూపులో గుర్తించానన్నట్టు అనిపిస్తే, నేను చిన్న చిరునవ్వు నవ్వాను. వకుళ గిరుక్కున వెనుదిరిగి వెళ్లిపోయింది. నేను కిందకొచ్చి మంచం వాల్చుకు పడుకున్నాను. ..

.. చిన్న కునుకు తీశాను కాబోలు కళ్లు తెరిచేవేళకి గదిలో ఎవరివో మాటలు వినిపిస్తున్నాయి. కంఠం పరిచయమైనట్టే ఉంది. ఆవిడ వకుళ వాళ్ల అమ్మ. నన్ను చూడగానే, ''కల్యాణి కదూ! ఎంతపెద్ద దానివయావూ..'' అంది.

చీర సంగతి తెలిసి ఆవిడ వచ్చిందట. ఆవిడకీ అర్థం కావడంలేదు వకుళ ధోరణి.

రోజుకొక డాక్టరుకి చూపిస్తున్నారు. ఎక్స్‌రేలు తీయిస్తున్నారు. స్పెషలిస్టులని కలుసుకున్నారు. అసలు పేషంటే తన బాధేమిటో చెప్పకపోతే డాక్టరేం చేస్తాడు? దేవుడే ''నీకేం కావాల''ని అడిగి కాని వరం ఇవ్వడు.

పిచ్చాసుపత్రికి కూడా తీసుకెళ్లారు--ఇదేదైనా పిచ్చి సంబంధమేమోనని. రెండురోజులు అక్కడ ఉంచమన్నారుట. సరేనని నరహరి స్పెషల్‌వార్డులో ఓ గది తీసుకుని అక్కడ వుంచాడు. కాని వకుళ మాటాడలేదు. మాటలాడకపోవడం తప్ప ఆమెలో మరే లోపమూ లేదు. అన్ని రకాల టెస్టులూ అయేక, ''ఆ పిల్లకేం పిచ్చి? అలా అన్నవాళ్లకి పిచ్చి. ఆ అమ్మాయి జబ్బు మనోవ్యాధి. ఆ పిల్లకేం కావాలో కనుక్కోండి,'' అన్నాడు ఆ పిచ్చి డాక్టరు.

''మీకు పిచ్చిలా వుంది. దానికి నిజంగా వొట్టి మనోవ్యాధే అయితే మేం తీసుకెళ్లిన డాక్టర్లందరి దగ్గిరికీ అదెందుకు వస్తుంది?'' అంది వకుళ తల్లి వరలక్ష్మమ్మ.

డాక్టరు నవ్వి ''నేం రాసిస్తానమ్మా ఆ అమ్మాయికేవిధమైన జబ్బూ లేదని. మీరు ఇంగ్లండు తీసికెళ్లినా అంతే. బహుశా ఈ పెళ్లి యిష్టం లేదేమో'' అన్నాడాయన. వరలక్ష్మమ్మ గారు పిల్లని తీసుకొచ్చేశారు.

పెళ్లి నిశ్చయం అయినప్పుడు వకుళ బొత్తిగా డాన్సు చెయ్య లేదు కాని మరేలాటి కళలూ చూపలేదు, యిష్టం లేదేమో అనుకోడానికి. పల్లెపట్టున, నాయనమ్మ హయాంలో పెరిగినందున ప్రేమా-గీమా అంటూ చెలరేగే అవకాశం లేదు. అట్టి సంగతి వకుళ ఎరుగనిది. పైగా ఈమూగనోము పట్టింది పెళ్లయిన నాలుగోరోజునించీ!

ఇంట్లో వంటపని ముసలావిడ చూసుకున్నా పై పనంతా చూసుకునేది వకుళే. చేసినపని చేతగానట్టు కానీ, అయిష్టంగా చేసినట్టు గానీ ఉండేది కాదు.

ఆఖరికి నరహరి ''నీకేం కావాలో చెప్పు, నేను సాధించుకొస్తా''నన్నాడుట.
ఆపదమొక్కులవాడికి మొక్కుకున్నారు నిలువుదోపిడీ ఇస్తామని.
నరహరి సైకాలజిస్టు దగ్గిరికి తీసుకువెళ్లాడు. అతను సవాలక్ష ప్రశ్నలు వేశాడు--ఆ అమ్మాయి పెరిగిన వాతావరణం ఎలాటిది? తల్లిదండ్రులు ఎలాటివారు? అమ్మాయి అభిరుచులేమిటి?..
నరహరి తనకి తోచిన సమాధానాలు చెప్పాడు. అవేమంత సంతృప్తికరంగా లేవు. రోజూ సూర్యాస్తమానం చూస్తూంటుందని చెప్పేడట. తనని ఆ సమయంలో చూస్తానన్నాడట ఆ సైకాలజిస్టు.
ఆవేళ సాయంకాలం పిట్టగోడకి ఇటు నేనూ అటు వకుళా నిలుచుని వుండగా, వచ్చారాయన.
నేను బాగుండదేమోనని వెనుదిరగబోయాను. వకుళ చప్పున నా చేయి పుచ్చుకుని ఆపింది. తనభావం గ్రహించుకుని నేను నిలబడిపోయాను అక్కడే. ఆ ప్రొఫెసరు వేసే వెయ్యిన్నొక్క ప్రశ్నలకి చెప్పలేకో, చెప్పే అభిప్రాయం లేకో, లేదా తనకి మిగిలిన ఆ ఒక్క ఘడియ ఆనందాన్ని తనకి కాకుండా చేయనుంకించిన ఆ మానవుణ్ణి పొమ్మని చెప్పమనో .. .
''ఇవాళ ఆకాశం బాగులేదు'' అన్నారాయన. వకుళ ఒక్క క్షణం ఆయనవేపు చూసి డాబా పిట్టగోడ దూకి మాయింట్లోకి వచ్చేసింది! మరుక్షణంలో అక్కడ ఎదురెదురుగా నిలబడింది నేనూ, శకుళ మనోభావాల్ని కనిపెట్టడానికొచ్చిన ఆ సైకాలజిస్టూను!
''ఆ అమ్మాయిని మీకెంతకాలంనించీ తెలుసు?'' అని ప్రశ్నించారాయన నన్నుద్దేశించి.
''నాకెంత కాలంనుండీ తెలీదు. నేను ఫోర్తుఫారం చదివేరోజుల్లో తను థర్డుఫారం చదువుతూండేది'' అన్నాను. వకుళని గురించి నాకు తెలిసింది చెప్పమని అడిగారు. వెనక్కి తిరిగి చూశాను. వకుళ నాగదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని రెండు చేతులతో కళ్ళు మూసుకుంది.
''మీరు సైకాలజిస్టు కనక, అడిగారు కనక నాకు తెలిసింది చెబుతున్నాను. ఇది కేవలం నాఊహే కావచ్చు కూడా. నాకు తెలిసినంతవరకూ వకుళ పువ్వువంటి మనిషి. పసిపాపవంటి అమాయకురాలు. పుస్తకాల్లో ఎత్తిచూపే మోసమూ, దగా, స్పర్థలూ, అసూయలూ పుస్తకాల్లోనే తప్ప నిజంగా ఉండవని నమ్మిన ముగ్ధ. తనని చూస్తే నాకు ఎప్పుడో ఎక్కడో చదివిన వాక్యాలు గుర్తుకొస్తాయి. బహుశా మీరూ చదివే వుండొచ్చు--ఒక ఆడదానికి మతి భ్రమించిందంటే ఒక మహా కవయిత్రి మనకి దక్కకుండా పోయినట్టు అని. ఒక అడవి మనిషి మూలికలు ఏరుకుంటూ తిరుగుతోందంటే ఒక ధీశాలిని మేధస్సు వృథా అయిపోతూన్నట్టని.
వకుళని చూస్తూంటే నాకు అదే జ్ఞాపకం వస్తుంది,'' అన్నాను.
''అది నిజమే కావచ్చు. కాని ఆ అమ్మాయిలో ఆ మార్పు తెచ్చిన సంఘట్టన ఏమిటో కనుక్కోండి ప్రయత్నించి. ఒక మనిషి షాక్ తినడం ఎంత సహజమో దానినుండి తేరుకోవడం కూడా అంతే సహజం. కారణం తెలిస్తే మనం దానికి ప్రతి ఆలోచించవచ్చు.''
ఆయన వెళ్లిపోయినా, నాకు వకుళదగ్గిరికి వెళ్లే సాహసం లేకపోయింది. తనకి యిష్టమైన ఆసాయం శోభని తిలకిస్తూ నిలబడిన నాకు తను వచ్చి నావెనకే నిలబడినట్టు తెలియనేలేదు. తనమొహం చూసి దొంగతనం చేసినట్టు ఫీలయేను.
వాళ్లమ్మని చూస్తే జాలేసింది నాకు. 'అర్థాయుష్కుడయిన కొడుకా, ఐదవతనం లేని కూతురా' అన్నట్టు నలభయ్యో పడిలో పడ్డాక కలిగిన ఒక్క కూతురూ.. ఆకూతురు బతుకు యిలా తెల్లారుతూంది!
నిజంగా వకుళకి ఈ కాపురం యిష్టం లేకపోతే కూతురిని తమ వూరు తీసుకుపోవడానికి సిద్ధం అవుతోంది ఆవిడ.
తల్లిప్రాణం!!

వకుళ ఎంతో కాన్ఫిడెంట్‌గా వచ్చి నాపక్కన నిలబడడం గుర్తుకొచ్చింది. ఎలా ప్రశ్నించను నీ మిస్టరీ ఏమిటని? అది మిగిలినవాళ్ళకెలా చెప్పను? చరిత్రలో విభీషణుడి దగ్గర్నుంచి దేశదేశాలా, మున్నూరు కాలాలా ప్రసిద్ధికెక్కిన పేర్లన్నీ కళ్లముందు మెదిలేయి. నాద్రోహానికి శిక్ష ఉండదు. కాని, వకుళ మామూలు మనిషయితే ఎంతమందికి పరమానందం కాదు! నాకు మటుకు అది సమ్మతం కాదూ?

★★★

మర్నాడు పొద్దున్న కాఫీ తాగి, ''నేను వాళ్లింటికి వెళ్తున్నా'' అన్నాను అమ్మతో.

''వెళ్లక్కర్లేదు'' అంది అమ్మ.

ఆ తరవాత తెలిసింది. దెయ్యం పట్టిందేమో అన్నారట ఎవరో. భూతవైద్యుణ్ణి పిలిపించారు. వాడు వకుళని నఖశిఖపర్యంతం నాలుగు మార్లు చూశాడు. చుట్టూ ప్రదక్షిణ చేశాడు.

''మూగదెయ్యం'' అన్నాడు. ఐదు వందల రూపాయలు కుప్ప పోయించాడు. దానిమీద చక్రం గీశాడు. నాలుగు కూతలు కూశాడు.

''పలుకు'' అన్నాడు. వకుళ పలకలేదు.

వేపమండలతో బాదేడు. పసుపూ, కుంకుమా, బూడిదా ఇల్లల్లా జల్లేడు. ''అమ్మా అను'' అన్నాడు. వకుళ అనలేదు. వాడు వెళ్లిపోయాక, వకుళచేతిమీద– మణికట్టునుంచి మధ్యవేలివరకూ జెర్రిపోతులాంటి ఎర్రని గీత చూడడంతో ఎవరికీ నోట మాట రాలేదు. నిజంగా ఆ పిల్లకి ఏం జబ్బుందో, దానివల్ల ఏం బాధ అనుభవిస్తూందో తెలీదు గానీ ట్రీట్‌మెంటు పేర్న ఆపిల్లని వీళ్లు నానాహింసా పెడుతున్నారు.

''ఎందుకొచ్చిన మందులండీ ఇవి. అసలు జబ్బుకన్నా వీటిబాధే ఎక్కువగా ఉన్నట్టుంది. కొన్నాళ్లపాటు ఊరుకోండి. అవే సర్దుకుంటాయి,'' అన్నాను.

''మేమూ అదే అనుకుంటున్నాం. పైగా నిన్న అతడు కూడా మాయ చేసి పశువుని అంటగట్టేంవని విసుర్లు విసిరేడు. మాణిక్యంలాటి పిల్ల ఇలా అయిపోయింది అని మేం ఏడుస్తుంటే ఈ పోటుమాటలు! ఏదవుతే అదే అవుతుంది. దాన్ని తీసుకుపోతాం. బాగుంటేనే పంపిస్తాం,'' అందావిడ.

వకుళ పరిసరాల్లో జరుగుతున్నవేవీ పట్టించుకోకపోతే, గ్రహించుకోకపోతే, తనంత అదృష్టవంతురాలు మరొకరు ఉండరు అనిపించింది నాకు.

ఆ సాయంత్రం వకుళని చూడ్డానికి వెళ్లాను, మర్నాడు ఉదయం వెళ్లిపోతుందని. నేను ఇంట్లో ప్రవేశించగానే, నావెనకే నరహరి వచ్చాడు. ''మీరు తీసికెళ్లి ఆ పల్లెటూళ్లో ఏం చేస్తారు? నాతోనే పంపించండి. అక్కడ నాస్నేహితుడొకడు స్పెషలిస్టున్నాడు. చూపిస్తాను'' అన్నాడు.

నోరూ వాయీ లేని, లేగదూడవంటి అమాయకురాలిని తొమ్మిదివందల దూరం తోలమంటున్నాడు. వరలక్ష్మమ్మ గారు విచిత్రంగా చూశారు అతడివేపు.

''అవును. నాతోనే తీసికెళ్లి, నేనే ట్రీట్‌మెంటిప్పిస్తాను.''

అంతవరకూ అక్కడ తనని కాదన్నట్టు నిర్వికారంగా కూచుని వున్న వకుళ భర్తవేపు తన దృక్కులు సారించింది. అది తపోనిష్ఠుడయిన ఫాలాక్షుడు మూడో కన్ను విప్పి మన్మథుడిని చూసిన చూపు. యుగయుగాలుగా మగవాడి అన్యాయానికి వినయంతో తలవంచిన స్త్రీత్వం మేలుకొని చూసిన చూపు. గగనంలో విహరిస్తున్న గరుత్మంతుని శివుని కంఠహారమైన కోడెత్రాచు చూసే చూపు. ఆ చూపులో శ్లేష లేదు. నరహరి తలవంచుకుని వెనుదిరిగి వెళ్లిపోయాడు.

ఆరాత్రి గాలి లేదని మంచం డాబామీద వేసుకున్నాను. వకుళని గూర్చిన ఆలోచనలు నిద్ర పోనీయలేదు. వకుళకి ఈ పెళ్లి యిష్టంలేదనడంలో సందేహం రేదు. యుగధర్మానికి ఎదురు చెబుతున్నట్టనిపించింది. అతడు నవమన్మధుడు కాకపోవచ్చు, కాని తల్లిదండ్రులు మెడలు విరిచి  చేసినది మటుకు కాదు. తను మొదటే ఎందుకు చెప్పలేదు?

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలివొచ్చేసరికి గదిలో గడియారం రెండు కొట్టింది. మంచంమీద ఎవరో ఉన్నట్టనిపించి కళ్లు తెరిచాను.

వకుళ!!

నేనూ లేచి కూర్చున్నాను. పున్నమి చంద్రుడు పిల్లజమీందారులా వెన్నెలలు వెదజల్లుతున్నాడు. వెన్నెట్లో తన కళ్లు నీటిలో చేపల్లా మెరుస్తున్నాయి.

నాకు ఏదో మాటాడాలనుంది. తనకి ధైర్యం చెప్పాలనుంది. కాని ఆ స్తబ్ధనిశీధిలో--జడప్రకృతిలో జడభరతునిలా వకుళ--ప్రకృతిలో ఓభాగంగా కనిపించింది. నేను తనకి ఏం చెప్పగలను? దేవతలకి పంచాంగం చెప్పగలదానిని గాను నేను.

''కల్యాణీ! ..''

''వకుళా! ..'' వకుళ మాటాడుతోంది! వందప్రశ్నలు నాలో చెలరేగాయి. ఏది ముందు? ఏది వెనక? ..

వకుళ నిశ్శబ్దంగా నాచేతిని తన చేతిలోకి తీసుకుంది.

''కల్యాణీ! అతను తృతీయా ప్రకృతివాడు.''

నిస్సహాయంగా వకుళ ఆడిన మాట వికృతంగా ధ్వనించింది ఆరాత్రి. తను ఇంక చెప్పవలసింది ఏమీ లేదు. తనని గురించిన మిస్టరీ ఏమీ లేదు. మంచుదెబ్బ తిన్న తమ్మిపువ్వు, నలిపి పారేసిన గులాబీపువ్వు మళ్లీ మొహం ఎత్తదు.

వకుళ వెళ్లిపోవడం నాకు తెలీదు. మళ్లీ నాకు తెలివొచ్చేసరికి ఇంగ్లీషులో వార్తలు చెబుతున్నారు. భరణిపుల్ల తీసుకుని బాత్‌రూంవేపు వెళ్తున్న నన్ను చూసి అమ్మ, ''వకుళ'' అంది.

''అవును'' అనబోయి, అమ్మ మొహం చూసి ఆగిపోయాను.

వకుళ చచ్చిపోయింది.

అరుగుమీద శవం చుట్టూ చేరి అందరూ ఏడుస్తున్నారు. నాకు తెలీకుండానే ఒక నిట్టూర్పు వెలువడింది.

వకుళ సుఖపడింది. వరలక్ష్మమ్మ గారు తల్చుకు తల్చుకు కుమిలిపోతున్నారు. వాళ్ల నాయనమ్మ ముందుగా చెప్పి పోయిందిట. అలాగే ఈ పిల్లకి కూడా ముందే తెలుసేమోనని ఆవిడ బాధ.

రాత్రి హఠాత్తుగా కడుపునొప్పి వచ్చి చుట్టుకుపోవడం మొదలుపెట్టిందిట. ఆస్పత్రికి తీసుకెళ్తుంటే సగందారిలోనే ప్రాణం పోయిందిట.

చూడలేక వెనుదిరిగాను. నరహరి గేటుదగ్గిర నిలబడి కల్లబొల్లి ఏడుపులు ఏడుస్తున్నాడు. లాగి చెంపపెట్టు పెడదామనిపించింది.

★★★

వకుళ జీవితం అలా ముగిసింది. కాని నరహరి ఎందుకు పెళ్లి చేసుకున్నాడు? అంత డబ్బు ఎందుకు ఖర్చు పెట్టాడు? అని నన్నడక్కండి. వట్టి పుణ్యానికి అబద్ధాలు చెప్పేవాళ్లూ, వృధాన్యార్థభంగము గావించెడువారూ, రెండురూపాయలు ధర్మం చేసి మూడుతరాల పేర్లు చెక్కించుకునేవాళ్లూ--వాళ్లెవరైనా చెప్పగలరేమో సమాధానం!

★★★

(1964-65 ప్రాంతాల్లో తొలిసారిగా ''రచన'' పత్రికలో ప్రచురింపబడింది. తరవాత 1969లో ''ప్రగతి వారపత్రిక'' లో పునర్ముద్రితం).